'పొట్లపల్లి' జాతరపై మంత్రి సమీక్ష

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతర ఏర్పాట్లపై రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఆలయ ఆవరణలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో పొట్లపల్లి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జాతర ఆహ్వాన పత్రిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అంతకు ముందు రాజేశ్వరస్వామివారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మానస, వైస్ ఎంపీపీ నిర్మల, మున్సిపల్ చైర్మన్ రజిత, వైస్ చైర్మన్ అనిత, కౌన్సిలర్ చిత్తారి పద్మ, ఆలయ ఈవో కిషన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

డైరీ ఆవిష్కరించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ సమగ్ర శిక్ష సీఆర్‌పీల సంఘం డైరీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష సీఆర్‌పీల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, కార్యదర్శి యాదగిరి, దయానంద్, మహేశ్, సాజిద్, స్వామి, లక్ష్మణ్, రాజశేఖర్, సంజయ్, శ్రీనివాస్, ఇందిర, అనురాధ, రమాదేవి, స్వప్న, భవాని, ఉష, జ్యోతి, కవిత, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, ఫిబ్రవరి 26: మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ మంగమ్మారామచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. మర్కూక్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన నీరుడి రాజు విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు గడ్డం ప్రసాద్, అచ్చంగారి భాస్కర్, ఎంపీటీసీ ధనలక్ష్మీకృష్ణ, మాజీ ఎంపీటీసీ గీతారాంరెడ్డి, వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కోహెడలో మాట్లాడుతున్న బండి సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 26: ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విమర్శించారు. సోమవారం ప్రజాహిత యాత్రలో భాగంగా కోహెడ మండల కేంద్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో ఒకటిరెండు మాత్రమే అమలు చేశారని, మిగతావి ఇగ చేస్తాం.. అగ చేస్తాం అంటూ ప్రజలను మభ్య పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ పథకాల విధి విధానాలు ప్రకటించకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏం చేశానో.. చెప్పడానికే ప్రజా హిత యాత్ర నిర్వహిస్తున్నానని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ఎంపీగా కరీంనగర్-వరంగల్, కరీంనగర్-జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు నిధుల తేవడంతోపాటు ఎస్ఆర్ఆర్ కళాశాలకు అటానమన్ హోదా తెచ్చానన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.698 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, నాయకులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

- నలుగురికి గాయాలు
- గాయపడ్డ వారిలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ కారు డ్రైవర్

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కొండపాక, ఫిబ్రవరి 26: కారు అదుపు తప్పి మరోకారును ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్పగాయాలైన ఘటన సోమవారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ డెయిరీ అడ్వైజర్ హన్మంతరెడ్డి హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. తిమ్మారెడ్డిపల్లి శివారులో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్ అవతలి వైపు వెళ్తున్న మరో కారును ఢీకొని పల్టీలు కొడుతూ చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో హన్మంతరెడ్డితో పాటు మరో కారులో హైదరాబాద్‌కు వెళ్తున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కారు డ్రైవర్ శోభన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హన్మంతరెడ్డి డ్రైవర్ ప్రశాంత్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న శోభన్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది గాయపడ్డ వారికి ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా బాధితుల పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

హుస్నాబాద్ మున్సిపాలిటీని ఆదుకోవాలి

- రూ.35.64 కోట్ల మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గ సభ్యుల ఏకగ్రీవ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 26: హుస్నాబాద్ మున్సిపాలిటీకి నిధులు కేటాయించి ఆదుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2024-25 సంవత్సరానికి రూ.35. 64కోట్ల 99 లక్షల మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గతంలో పట్టణ ప్రగతి నిధులు మంజూరు చేసేవారని, కొంతకాలంగా ఆ నిధులు రాకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న హైవే రోడ్డు పనుల్లో భాగంగా తిరుమల గార్డెన్ వరకు సెంట్రల్ లైటింగ్, మురుగు కాల్వలు నిర్మించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ పట్టణం ఇప్పటికే పలు రంగాల్లో అభివృద్ధి సాధించిందని, మరింత అభివృద్ధి సాధించేందుకు నిధులు ఇవ్వాలని వైస్ చైర్‌పర్సన్ అనిత కోరారు. హుస్నాబాద్‌లోనే తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, పలు ప్రాంతాల్లో సర్కిల్స్, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్, ఈఈ ప్రతాప్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు అయూబ్, శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

ఆదాయం రాకుండా ఖర్చులు ఎలా చేస్తారు..?

హుస్నాబాద్ మున్సిపాలిటీకి ఆదాయం పెంచుకోకుండా ఖర్చులు ఎలా చేస్తారని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ప్రశ్నించారు. రూ.93 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా, కేవలం రూ. 13 లక్షల ఆదాయం మాత్రమే వసూల్ చేస్తే మున్సిపల్ ఎలా ముందుకు సాగుతుందనే విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలన్నారు. మంచినీటితోపాటు మిగితా పన్నులు సకాలంలో వసూల్ చేసి అభివృద్ధి పనులు నిర్వహించుకోవాలని పాలకవర్గానికి ఆయన సూచించారు.

– శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ముగిసిన జీసీఎల్ క్రికెట్ టోర్నీ

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 26: యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్ సూచించారు. గజ్వేల్‌లో నిర్వహించిన జీసీఎల్ క్రికెట్ టోర్నీ ఆదివారం రాత్రి ముగిసింది. ఈ టోర్నీలో తల్వార్స్ బాయ్స్ జట్టు విజేతగా, ఎస్ఎస్ స్పోర్ట్స్ రన్నర్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.40 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి క్రికెట్ టోర్నీ నిర్వహించామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడారంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు సూర్యప్రకాశ్, బొజ్జ రవి, భరత్, హరిశ్చంద్రప్రసాద్, స్వామిని ఆయన అభినందించారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట అర్బన్ : అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 26 : ఉన్నతాధికారులు నేరుగా ప్రజా సమస్యలు విని పరిష్కరించడానికి మొదలు పెట్టిన గొప్ప కార్యక్రమం ప్రజావాణి అని జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగరాజమ్మ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించేందుకు అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని, వారందరికీ న్యాయం చేయడమే అధికారుల బాధ్యత అని అన్నారు. వివిధ సమస్యలపై మొత్తం 45 దరఖాస్తులు వచ్చాయని, త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, అధికారులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లును తొలిగించాలి

కొండపాక, ఫిబ్రవరి 26: మండలంలోని బందారం గ్రామ నడిబొడ్డున ఉన్న రైస్ మిల్లును తొలిగించాలని బందారం గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రైస్ మిల్లు నుంచి వెలువడే దుమ్ము,ధూళితో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వెంటనే అధికారులు స్పందించి రైస్ మిల్లును గ్రామం మధ్యలో నుంచి తొలిగించాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో గ్రామస్తులు మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకట్ ఉన్నారు.

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు

సిద్దిపేట అర్బన్: ఘటనపై గ్రామస్తులను ఆరా తీస్తున్న త్రీ టౌన్ పోలీసులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 26 : మహాత్మా గాంధీ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసిన ఘటన మండల పరిధిలోని బక్రిప్యాలలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. బక్రిచెప్యాల గ్రామ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు గ్రామానికి చేరుకొని ఘటనపై ఆరా తీసి దర్యాప్తు చేపట్టారు. గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 26: సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి కొండ్ల మల్లికార్జున్, మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు రత్నాకర్, జిల్లా నాయకులు, వాసవి క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చేర్యాల, ఫిబ్రవరి 26: మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని కూల్చివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని చేర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్ముడి విగ్రహాన్ని కూల్చివేసిన దుండగులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన విద్యార్థులు

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 26: సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించే అవకాశం కల్పించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సందర్శించిన వారిలో అధ్యాపకులు డాక్టర్ రమేశ్ బాబు, బాలరాజు, డాక్టర్ భవాని, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, డాక్టర్ కవిత, డాక్టర్ పెద్దిరాజు, లక్ష్మీనారాయణ, లావణ్య, రాజశేఖర్, కైలాస్, 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

అక్కన్నపేట, ఫిబ్రవరి 26: మండలంలోని అంతకపేటలో ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీవో జయరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పనికి వచ్చే కూలీలు తప్పనిసరిగా జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. పనులు చేసే సమయంలో జాగత్రలు పాటించాలన్నారు. పనిచేసే ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్‌కు సూచించారు. అనంతరం ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తలాపున పెద్దవాగు

- నిలిచిపోయిన దేవాలయ, గృహాల నిర్మాణ పనులు
- గ్రామానికి రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ల యజమానులపై కేసులు
- పెద్దవాగు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో

చేర్యాల, ఫిబ్రవరి 26: తలాపున పెద్దవాగు ఉన్నా ఇసుకను తమ అవసరాలకు ఉపయోగించుకోలేక మండలంలోని ఆకునూరు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో పెద్దవాగుల్లో ఒకటైన ఆకునూరు నుంచి ఇసుక అక్రమంగా రవాణా కాకుండా గ్రామస్తులు, వాగు పరిసర రైతులు పెద్ద వాగు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసుకొని కొన్ని దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. గ్రామంలోని వాగు నుంచి ఇసుక తీసుకొచ్చి ఇండ్ల నిర్మాణంతోపాటు దేవాలయాలు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించేవారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌తో గ్రామస్తులకు సమస్య తలెత్తింది. ఇటీవల ఆకునూరు పెద్దవాగు వాగు నుంచి గ్రామంలో నిర్మిస్తున్న దేవాలయ నిర్మాణం కోసం తీసుకొస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. దీంతో గృహాల నిర్మాణాలతో పాటు దేవాలయ నిర్మాణాలు, పాత ఇండ్ల మరమ్మతులు పనులు నిలిచిపోయాయి.


ఆకునూరులో రాస్తారోకో చేస్తున్న పెద్దవాగు పరిరక్షణ కమిటీ సభ్యులు, నాయకులు

గ్రామస్తుల రాస్తారోకో..

ఆకునూరు గ్రామ అవసరాల కోసం వాగు నుంచి ఇసుకను ఉపయోగించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్ద వాగు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆకునూరు గ్రామ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకరి శ్రీధర్‌గౌడ్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అందె అశోక్, నాయకులు బోయిని బాలయ్య, పుల్లని వేణు, అందే నాని బాబు, కోయినేని నర్సయ్య, తోట శ్రీనివాస్, కడారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 26: పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం గజ్వేల్‌లోని మోడల్ పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహించనున్న సూపరింటెండెంట్, కస్టోడియన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది కేవలం ఏడు పేపర్లు మాత్రమే ఉంటాయన్నారు. పరీక్షల సమయంలో విధుల్లో ఉండే ఉపాధ్యాయులు అలసత్వం వహించొద్దన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పరీక్షల విభాగం అధికారులు లక్ష్మణ్, వీరేశం, ఎంఈవోలు ఉదయభాస్కర్, సునీత, నరసమ్మ పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ నియామకంపై హర్షం

హుస్నాబాద్, ఫిబ్రవరి 26 : తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడిపె మల్లేశ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టుగా, జర్నలిస్టుల సంఘం నాయకుడిగా దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి ఈ పదవి రావడం జర్నలిస్టులకు శుభసూచకమన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిరుదొడ్డి, ఫిబ్రవరి 26 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మిరుదొడ్డి ఎస్సై వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన సంజీవరెడ్డి గ్రామ శివారులోని నాగయ్య వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టాలి

ములుగు, ఫిబ్రవరి 26: మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టాలని గజ్వేల్ ఏసీపీ బాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రం ములుగు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలోని సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించి ఘటనాస్థలానికి చేరుకోవాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట ఎస్సై విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బెజ్జంకి, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంతోపాటు రేగులపల్లి, గుండారం గ్రామాల్లో పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, గోదాంలలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. పలు దుకాణాల్లో అనుమతిలేని మందులు విక్రయించడంతో సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా రైతులకు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎవో సంతోష్, ఏఈవో సాయిశంకర్, ఏటీఎం సాయి తదితరులు పాల్గొన్నారు.

'మల్చింగ్'తో అధిక దిగుబడులు

మర్కూక్, ఫిబ్రవరి 26: మల్చింగ్ విధానంతో అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సౌమ్య అన్నారు. సోమవారం మండలంలోని మల్చింగ్ విధానంలో సాగుచేస్తున్న పంటలను ఆమె పరిశీలించారు. మండలంలో మల్చింగ్ సాగు విధానంలో 118 ఎకరాలు సాగు చేస్తున్నారన్నారు.

రక్తమిచ్చి.. ఊపిరిపోసి..

వర్గల్, ఫిబ్రవరి 26: ప్రాణాపాయంలో ఉన్న మహిళకు ఓ కానిస్టేబుల్ రక్తదానం చేసి ఊపిరిపోశాడు. వివరాల్లోకి వెళ్తే.. కుకునూర్‌పల్లి మండలం తిప్పారం గ్రామానికి చెందిన ఓ మహిళకు సోమవారం ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా(ఎ) నెగిటివ్ బ్లడ్ అవసరం వచ్చింది. వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహేశ్ తన మిత్రుడి ద్వారా సమాచారం తెలుసుకొని వెంటనే గజ్వేల్‌లోని పీవీ నర్సింహారావు బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి సదరు మహిళకు రక్తదానం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

దుబ్బాక, ఫిబ్రవరి 26: దుబ్బాక పట్టణంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గాజుల నరేశ్ సోమవారం ఉదయం తన కుటుంబీకులతో కలిసి చౌదర్‌పల్లి దుబ్బరాజేశ్వరాలయానికి వెళ్లాడు. నరేశ్ ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బంది, ఇంటి యజమానికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు.

ఫ్రీ బస్సు మినహా ఏ ఒక్కటీ అమలు కాలేదు

- బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్


గజ్వేల్ : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్

గజ్వేల్, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఫ్రీ బస్సు మినహా ఏ ఒక్కటి అమలు కాలేదని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు రూ. 2500, రైతుబంధు రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు, మహిళలకు వడ్డీలేని రుణాలు వెంటనే అమలు చేయాలన్నారు. హైదరాబాద్ చుట్టూ నోటిఫై చేసిన భూములను రద్దు చేయాలనే డిమాండ్ కొనసాగుతుందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు మహేశ్, నాగులు, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

తొగుట, ఫిబ్రవరి 26: ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ అధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర సోమవారం తొగుటకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను మర్చిపోయిందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస